# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-11-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈరోజు గుజరాత్ లో పర్యటించనున్నారు.**
2. **ఆంధ్రప్రదేశ్ ను ఔషధ రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు జపాన్ సహకారం అవసరమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
3. **జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపు తమ బాధ్యతను మరింత పెంచిందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు.**
4. **రాజధాని అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**
5. **జార్ఖండ్ ప్రాంతంలోని బిర్సా కొండల్లో విప్లవ ఉద్యమాన్ని రేకెత్తించిన ధర్తీ ఆబా భగవాన్ బిర్సా ముండా జయంతి ఈ రోజు.**

==========================

ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఈరోజు గుజరాత్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా 9 వేల 700 కోట్ల రూపాయలతో వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, అభివృద్ధి పథకాలకు ప్రధాన మంత్రి ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు చేయనున్నారు. ధర్తీ ఆబా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకల్లోను ప్రధాన మంత్రి పాల్గొంటారని అధికారులు వెల్లడించారు.

--------------------------

ఉక్కు రంగంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్ పారిశ్రామిక వేత్తలు ఆసక్తితో ఉన్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆ దేశ రాయబారి ఓనో కేయిచ్చి తెలిపారు. విశాఖపట్నంలో భారత పరిశ్రమల సమాఖ్య – సిఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా జపాన్ దేశ రాయబారి ఓనో కేయిచ్చి, ముఖ్యమంత్రితో నిన్న సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ ను ఔషధ రంగంలో కూడా అగ్రగామిగా నిలిపేందుకు జపాన్ సహకారం అవసరమని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రాష్ట్రంలో లులూ చేపట్టే ప్రాజెక్టులను 3 ఏళ్లలోగా పూర్తి చేయాలని ఆ సంస్థ ఎండి యుసుఫ్ అలీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. సిఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా లులూ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం నిన్న ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టులు విశాఖపట్నంలో

పర్యటక రంగ అభివృద్ధికి దోహదపడతాయన్నారు.

గ్రీన్ అల్యూమినియం కాంప్లెక్సు సహా 2జి ఇథనాల్ తయారీ యూనిట్లను రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ఏఎం గ్రీన్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సమక్షంలో ఆ సంస్థ ప్రతినిధులు ఈ ఒప్పందాలను చేసుకున్నారు.

---------------------------

తెలంగాణలోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించారు. నిన్న నిర్వహించిన ఓట్ల లెక్కింపులో ఆయన తన సమీప బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై 24 వేల 729 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీల్ యాదవ్ కు 98 వేల 988 ఓట్లు రాగా, బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు 74 వేల 259 ఓట్లు పోలయ్యాయి. ఈ ఉప ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీల్ యాదవ్‌కు జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి కర్ణన్ ధృవీకరణ ప్రతాన్ని అందజేశారు.

---------------------------

జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపు తమ బాధ్యతను మరింత పెంచిందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు నిశితంగా పరిశీలించి ఈ తీర్పును ఇచ్చారన్నారని తెలిపారు. హైదరాబాదు నగరాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల ఫలితాలపై హైదరాబాదులో నిన్న ముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ప్రతిభకు కొదవ లేదని ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విశాఖపట్నంలో నిర్వహిస్తున్న భారత పరిశ్రమల సమాఖ్య –సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా 'దేశంలోని ద్వితీయ శ్రేణి నగరాల్లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, గ్లోబల్ కెపబులిటీ సెంటర్ల ఏర్పాటు' అనే అంశంపై సదస్సు నిన్న జరిగింది. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్లోబల్ కెపబులిటీ సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సౌకర్యాలను కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరి నైపుణ్యాలను అంచనా వేసి, నైపుణ్య భాగస్వాములచే సరైన శిక్షణ ఇవ్వడానికి ఒక వ్యవస్థని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో మై భారత్ – నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో 'యూనిటీ మార్చ్' పేరిట ర్యాలీని నిన్న నిర్వహించారు. సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా జాతీయ సమైక్యతా దినోత్సవంలో భాగంగా చేపట్టిన ఈ ర్యాలీని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానంతరం దేశ ఐక్యతకు వల్లభ్ భాయ్ పటేల్ చేసిన కృషి మరువలేనిదన్నారు. ర్యాలీ జిల్లా పరిషత్ హాలు నుండి కోనేరు సెంటర్ వరకు సాగింది.

---------------------------

జార్ఖండ్ ప్రాంతంలోని బిర్సా కొండల్లో విప్లవ ఉద్యమాన్ని రేకెత్తించిన ధర్తీ ఆబా భగవాన్ బిర్సా ముండా జయంతి ఈ రోజు. భగవాన్ బిర్సా ముండాగా ప్రసిద్ధులైన ఈయన 1875 నవంబరు 15న జార్ఖండ్ లోని చోటా

నగర్ సమీపాన ఓ కుగ్రామంలో జన్మించారు. ఆదివాసీలపై బ్రిటీష్ పాలకులు చేస్తున్న అరాచకాలను తీవ్రంగా వ్యతిరేకించారు. వారి అకృత్యాలపై తిరుగుబాటు చేసి ధైర్య సాహసాలను ప్రదర్శించారు. సాంఘిక సంస్కరణల ఆవశ్యకతను గుర్తించిన ఆయన ఆదివాసీల జీవితాలలో వెలుగులు నింపేందుకు నిరంతరం శ్రమించారు. 1900 సంవత్సరం జూన్ 9న అశువులు బాసారు. దేశ స్వాతంత్ర్యం కోసం బలిదానం చేసిన భగవాన్ బిర్సా ముండా జయంతిని కేంద్ర ప్రభుత్వం 'జన్ జాతీయ గౌరవ్ దివాస్'గా ఈ రోజు నిర్వహిస్తోంది.

---------------------------

రాజధాని అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. విశాఖ సిఐఐ భాగస్వామ్య సదస్సులో తొలిరోజు పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 32 ఒప్పందాలు చేసుకున్నట్లు పేర్కొన్నారు. రాజధానిలో 36 వేల 648 కోట్ల రూపాయలు, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్‌లో వెయ్యి, 680 కోట్ల రూపాయలు, మున్సిపల్ శాఖ డైరెక్టరేట్ నుంచి వెయ్యి 800 కోట్ల రూపాయల మేర పెట్టుబడులకు ఈ ఒప్పందాలు జరిగాయన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

వాయిస్.. 32 సెకన్లు

---------------------------

మైనార్టీలకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యతను ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. ఇమామ్ లు, మౌజన్లకు గౌరవ వేతనం కింద గత ప్రభుత్వ బకాయిలతో కలుపుకొని 90 కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. నంద్యాలలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 6 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైందని తెలిపింది. ముఖ్యంగా ఏజెన్సీతోపాటు మైదాన ప్రాంతాల్లోనూ చలి తీవ్రత పెరుగుతోందని పేర్కొంది.

తెలంగాణ వ్యాప్తంగా ఈ రాత్రి చలి తీవ్రత అధికంగా ఉంటుందని హైదరాబాదు వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఉదయం వేళల్లో ఉష్ణోగ్రతలు 10 డిగ్రీలకు పడిపోనున్నాయని పేర్కొంది. ఇక పశ్చిమ తెలంగాణాలో ఉష్ణోగ్రతలు 7 డిగ్రీలకు తగ్గే అవకాశం ఉందని తెలిపింది.

---------------------------

కోల్ కతాలోని ఈడెన్ గార్డెన్స్ లో భారత్, దక్షిణ ఆఫ్రికాల మధ్య జరుగుతున్న క్రికెట్ తొలి టెస్టు మ్యాచ్‌లో నిన్న మొదటి రోజు ఆటలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణ ఆఫ్రికా 159 పరుగులకు ఆలౌటైంది. అనంతరం మొదటి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన భారత జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ నష్టానికి 37 పరుగులు చేసింది. రెండవ రోజు ఆట ఈ ఉదయం 9 గంటల 30 నిముషాలకు ప్రారంభం కానుంది.

=====================